16

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

(18)

## (గొరగనమూడిలో శ్రీనాన్నగారి ప్రవచనము 22-11-95)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఒక డాక్టరుగారు జ్ఞానానంద్‌ను మీరు హిమాలయములలో చాలా కష్టపడి తపస్సు చేసారు కదా అని అడిగితే కష్టమయితే అంతకాలము అక్కడ ఉండగలమా అన్నారట జ్ఞానానంద్. మేము చేసినది normalగానే చేసాము, naturalగానే చేశాము. కష్టం, కష్టం అని మీరు అనుకొంటున్నారు. నిజంగా మీరు అనుకొన్నంత కష్టం ఉంటే ఆకష్టంలో ఎన్నిరోజులు గడుపుతాము అన్నారట. జ్ఞానానంద్ ఏమిచెప్పినా నిరాడంబరముగా చెప్పేవారు. ఆలోచనే ప్రధానముగా, సబ్జక్టు ప్రధానముగా చెప్పేవారు.

వ్యర్థమైన ఆలోచనల తోటి, వ్యర్థమైన పనులతోటి, వ్యర్థమైన చింతలతోటి మీ ప్రాణశక్తిని దుర్వినియోగం చేసుకోవద్దు. నిర్మాణాత్మకమైన పనికి దానిని ఉపయోగించుకోండి, మీప్యూరిఫికేషన్‌కు దానిని ఉపయోగించుకోండి అని జ్ఞానానంద్ చెపుతూ ఉండేవారు. ప్రాణశక్తిని సద్వినియోగం చేసుకొంటే చైతన్యస్థాయి పెరుగుతుంది, ఆధ్యాత్మిక శక్తి కలుగుతుంది. మనకు ఎప్పుడైతే ప్యూరిటీ వచ్చిందో, Truthను ఎప్పుడైతే ప్రాక్టీసు చేస్తున్నామో మనకులోపల ఒక energy వస్తుంది. అప్పుడు మనమాటకు విలువ ఉంటుంది. మనచేతకు విలువ ఉంటుంది, మన చూపుకు విలువ ఉంటుంది. లోపల శక్తిఉంటే, Truth పట్ల ప్రేమ ఉంటే ఏది మాట్లాడినా చైతన్యవంతముగా ఉంటుంది.

ఆనంద్ ఎప్పుడూ బుద్ధుని కూడా ఉండేవాడట. ఆనంద్ బుద్ధునికి సవితి తమ్ముడు. బుద్ధుని మీద ఉన్న ఆప్యాయత కొలది ఒకసారి ఆనంద్ బుద్ధునితో నీ అంతమహోన్నతమైన వ్యక్తి చరిత్రకు అందినంతవరకూ ఈ భూమిమీద పుట్టి ఉండలేదు అన్నాడట. అప్పుడు బుద్ధుడు నీవు చరిత్రనంతా అధ్యయనం చేసావా అని ఆనంద్‌ను అడిగాడు. అధ్యయనం చేయలేదు అని ఆనంద్ చెప్పాడు. అధ్యయనం చేయకుండా నా అంతమహోన్నతమైన వ్యక్తి లేడు అని నీవు ఎలా చెప్పగలవు అని బుద్ధుడు అన్నాడట.

బుద్ధునిలో ఒక విశేషం ఉంది. దేవుడు ఉన్నాడా, లేడా అనే గొడవ లేకుండా సూటిగా మిమ్మలను blissలోనికి పంపటానికి ప్రయత్నం చేసాడు. దేవుని గురించి అడిగితే మౌనం వహించేవాడు. మరొక ఉద్దేశం ఏమీకాదు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా మిమ్మలను సూటిగా నిర్వాణస్థితిలోనికి తీసుకొని వెళ్ళటానికి ప్రయత్నించాడు. అదీ ఆయన ఉద్దేశం.

బుద్ధుడు శరీరం విడిచిపెట్టడానికి ముందు ఆనంద్ బుద్ధుడిని మరణం తరువాత ఈ శరీరమును ఏమి చేయమంటారు అని అడిగాడు. కనీసం జ్ఞాపకం కోసం ఏదో సమాధి కట్టండి అని అలా ఏమీ బుద్ధుడు చెప్పలేదు. ఈ గ్రామంలో చనిపోయిన వారి శవాలను ఏ స్మశానంలో పారవేస్తున్నారో అక్కడే ఈ శవాన్ని కూడా పారవేయండి అని బుద్ధుడు చెప్పాడు. వాడు బుద్ధుడు అంటే.

యోగి రామయ్యగారు రమణాశ్రమం వెళుతూ ఉండేవారు. ఒకసారి చమత్కారంకోసం గాంధీగారు

రామయ్యగారిని ఒక ప్రశ్న అడిగారు. అందరి హృదయములలో పరమేశ్వరుడు ఉన్నాడు కదా. రమణమహర్షి హృదయంలో ఉన్నవాడు మన హృదయంలోనూ ఉన్నాడు కదా. ఇంక ఆయనలో ప్రత్యేకత ఏమిటి అని అడిగారట. అప్పుడు యోగి రామయ్యగారు అందరి హృదయములలో ఉన్నదే ఆయన హృదయంలోనూ ఉంది. అందులో ఏమీ తేడాలేదు. కాని ఆయన హృదయంలో ఉన్నది ఏమిటో ఆయనకు తెలుసు. మన హృదయంలో ఉన్నది ఏమిటో మనకు ఇంకా తెలియలేదు. అందువలన ఆయన జ్ఞాని అయ్యాడు. మనం అవ్వలేకపోయాము అని చెప్పారట. ఈ సమాధానానికి గాంధీగారు చాలా సంతోషించారట.

ప్రకృతి గుణాలు దాటిన తరువాత ఉన్నస్థితి ఒక్కటే. నిజం అనేది ఒకటిగానే ఉంటుంది. జ్ఞానం ఒకటిగానే ఉంటుంది. ఎవడైతే ప్రకృతి గుణాలు దాటాడో అక్కడ ఉన్నస్థితి ఒక్కటే కాబట్టి దానిని వాడు పొందుతాడు. నీ హృదయంలో చైతన్యం ఉంది. చైతన్యము జడ పదార్థము కాదు. అందులో జ్ఞానము, శక్తి ఉన్నాయి. చైతన్యము అనుభవంలోనికి వచ్చినపుడు అవి స్పష్టముగా తెలుస్తాయి.

భగవంతుడు చెప్పిన మాటలను మన అహంకారము నమ్మనివ్వదు. నాలుగు మొట్టికాయలు తిన్న తరువాత భగవంతుడు చెప్పాడు నిజమే మనకు తెలియక ఇలా అనుకొన్నాము అనిపిస్తుంది. జ్ఞాని చెప్పిన మాటలు, భగవంతుడు చెప్పిన మాటలు మనకు సొంతం అవ్వవు. వాటిని సొంతం చేసుకొన్నవాడు వివేకవంతుడు.

ప్రాణప్రయాణ సమయంలో అనుకొన్నది ఎప్పుడూ రాదు. లోపల ఉన్నదే వస్తుంది. గాంధీ గారు మరణసమయంలో హే రామ్ ! అన్నారు. ఆయన జీవితం పొడుగునా అలవాటు చేశారు. ఆయన హృదయంలో ఉన్నది అదే. అందువలన అదే బయటకు వచ్చింది. మనకు ఇష్టం వేరుగా ఉంటుంది, రామా, రామా అంటూ ఉంటాము. ఇలా జీవించే వారికి మరణ సమయంలో దేవుడు జ్ఞాపకం రాడు. దేనికోసం జీవితం పొడుగునా జీవించామో అదే మరణ సమయంలో జ్ఞాపకం వస్తుంది. మరణ సమయంలో అనుకొన్నది రాదు, హృదయంలో ఉన్నదే వస్తుంది.

ఆనంద్‌లో ఒక బలహీనత ఉండేది. బుద్ధుడు చెప్పిన దానినంతా ఆయన enjoy చేశాడు. కాని బుద్ధుడు తన అన్నగారు అనే దేహబుద్ధి పోవటం కష్టం అయిందట. దేహవాసన పోవటం చాలా కష్టము. అన్ని వాసనలలోకి దేహవాసన చాలా బలీయమైనది.

బుద్ధుడు శరీరము విడిచిపెట్టె సమయంలో ఆనంద్ కన్నీరు కారుస్తూ ఉంటాడు. అప్పుడు బుద్ధుడు ఆనంద్‌తో నాకోసం నీవు బాధ పడవద్దు, నాకోసం నీవు ఆలోచించవద్దు, బుద్ధుడు ఎక్కడ పుట్టాడు, ఎక్కడ చనిపోయాడు, బుద్ధుడు ఏమైపోయాడు అని ఆలోచించవద్దు, బుద్ధుడు గొప్పతనం గురించి కూడా ఆలోచించవద్దు. బుద్ధుడు వారి ఇంట మాంసం తిని చనిపోయాడు అని వారి పేరులు బయట పెట్టవద్దు. అలా పేరులు చెపితే వారికి చెడ్డ పేరు వస్తుంది. ఇవి అన్నీ వద్దు. బుద్ధుడు ఏ స్థితిని అయితే పొందాడో ఆ స్థితిని నీవు కూడా పొందడానికి ప్రయత్నించు. బుద్ధుడు పొందిన నిర్వాణ స్థితిని నీవు కూడా పొందడానికి ప్రయత్నించు అని చెప్పాడు. బుద్ధుడు చాలా గొప్పవాడు అని నీవు ప్రచారం చేయనక్కరలేదు. ఎందుచేతనంటే అబద్ధానికి ప్రచారం కావాలి గాని నిజానికి ప్రచారం అక్కరలేదు.

ఒక ప్లీడరు గారు భగవాన్‌ను కోరికలు ఉండవచ్చునా అని అడిగారు. కోరికలు ఉండకూడదు అని భగవాన్ చెప్పారు. మరి నేను అరుణాచలం రావటం కోరిక ఉండటం వలననే వచ్చాను కదా అని అడిగితే కోరిక ఉండటం వలననే వచ్చారు అని భగవాన్ అన్నారు. కోరికలు ఉండకూడదు అంటున్నారు, మరి దీని

మాట ఏమిటి అని ఆయన భగవాన్‌ను అడిగారు. అప్పుడు భగవాన్ ఆయనను మీకు ఇది ఒక్కటే కోరిక ఉందా లేక ఇంకా కోరికలు ఉన్నాయా అని అడిగారు. ఇంకా చాలా కోరికలు ఉన్నాయి అందులో ఇది కూడా ఒకటి అన్నారు. అయితే నీకు అనేక కోరికలు ఉంటే చెడ్డ కోరికలు అన్నింటిని దాచుకొని ఇటువంటి మంచి కోరికను వదిలివేస్తావా అని అడిగారు.

ఒక భక్తుడు భగవాన్‌తో మీచేతికి వచ్చిన పుండుకు డాక్టర్లు వైద్యం చేశారు, నయం చేయలేకపోయారు. ఆ కురుపును పొమ్మని అనుకోండి అని భగవాన్‌ను అడిగాడు. కురుపును పొమ్మని అనుకోమంటున్నారు. కురుపును పొమ్మని అనుకోవడానికి అనుకొనేవాడు ఒకడు లోపల ఉండాలి కదా. అనుకొనేవాడు లోపల ఉంటే మీరు చెప్పకపోయినా అనుకొంటాడు. అనుకొనేవాడు ఇక్కడ లేడు. వాడు ఎప్పుడో చనిపోయాడు. ఇక్కడ ఉన్నవాడు ఎవడో మీకు అర్థంకాదు. ఈ సమాధానం చూస్తే ఆయన ఏ స్థితిలో ఉన్నాడో మనకు తెలుస్తుంది.

జ్ఞాని ఒక మాట చెపితే అది నదులు దాటుతుంది, సముద్రాలు దాటుతుంది, సృష్టి ఎంతకాలము ఉంటుందో అంతకాలము ఆమాట జీవించి ఉంటుంది. ఎందుచేతనంటే అది మనస్సులోనుండి రాలేదు, Sourceలో నుండి వచ్చింది. భగవంతుడు జ్ఞానియొక్క దేహమును వాడుకొంటాడు. జ్ఞాని ఏమి చెప్పినా అది దేవుని వాక్యముతో సమానము.

ఒకరు భగవాన్‌తో ప్రపంచము అంతా దుఃఖపూరితంగా ఉంది అన్నారు. నీ దుఃఖాన్ని ప్రపంచానికి అంటగడుతున్నావు. నీ దుఃఖాన్ని పోగొట్టుకొని చూడు ప్రపంచంలో ఎంత దుఃఖం ఉందో అప్పుడు నీకు తెలుస్తుంది అన్నారు భగవాన్. ఎదుటి వారి బాధను మనం సొంతం చేసుకోలేము గాని మన బాధను ప్రపంచము అంతా సొంతం చేసుకోవాలి అని మన తిప్పలు.

చనిపోయిన తరువాత ఎక్కడికి వెళతాము అని అడిగితే నీవు రోజూ నిద్రలో ఎక్కడ ఉంటున్నావో మరణించిన తరువాత కూడా అక్కడే ఉంటావు అని రమణమహర్షి చెప్పారు. గాఢనిద్రలో నీవు ఉంటున్నావు కదా. రోజూ గాఢనిద్రలో నీవు ఎక్కడ ఉంటున్నావో చనిపోయిన తరువాత కూడా అక్కడే ఉంటావు. ఎక్కడికీ పోవు. కంగారు పడవద్దు అన్నారు భగవాన్. దీనికి బుద్ధుడు చెప్పిన సమాధానం ఏమిటి అంటే చనిపోయిన తరువాత ఎవడైతే ఉంటాడు అనుకొంటున్నావో వాడు ఇప్పుడు కూడా లేడు అని చెప్పాడు. చనిపోయిన తరువాత ప్రయాణం చేసేవాడు జీవుడు. ఇప్పుడు విచారణ చేసి చూస్తే అసలు జీవుడనే వాడు లేడని నీకు తెలుస్తుంది అని బుద్ధుడు చెప్పాడు.

హిందూమతము చాలా సనాతనమైనది. ఇది ఒక సనాతన ధర్మము. ఈ సనాతన ధర్మమునే హిందూమతంగా మనం వ్యవహరించుకొంటున్నాము. ఇది ఒక జీవిత విధానము. ఈ జీవిత విధానము లోనివి ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ఇందులో మోక్షము ప్రధానమైనది. మనం అర్థ, కామములను పట్టుకొంటున్నాము. ధర్మ మోక్షములను విడిచిపెట్టేస్తున్నాము. అర్థ, కామములను నీవు enjoy చేసినా అవి ధర్మబద్ధంగా ఉంటే నీవు మోక్షమును పొందగలవు అని చెప్పారు.

జ్ఞానం, జ్ఞానం అంటే పుస్తక జ్ఞానము కాదు. పుస్తక జ్ఞానమును సంపాదిస్తే పండితుడు అవుతాడు. జ్ఞానమును పొందటం అంటే భగవద్గీత, ఉపనిషత్‌లు కంఠస్థము చేయటం కాదు. ఈ సృష్టి అంతా ఒక తత్త్వము వ్యాపించి ఉంది. అది నీ హృదయంలో కూడా ఉంది. అది వేరు, ఇది వేరు కాదు. నీ హృదయంలో ఉన్న తత్త్వమును తెలుసుకొన్నాక సృష్టి అంతా వ్యాపించి ఉన్న తత్త్వానికి, ఈ తత్త్వానికి

ఏమీ బేధం కన్పించడంలేదు, అదే ఇది, ఇదే అది అని నీకు అనుభవంలోనికి వస్తుంది. అలా ఎవడైతే అనుభవం పొందాడో వాడిని జ్ఞాని అని పిలుస్తారు. కృష్ణుడు చెప్పిన జ్ఞానం అది. తత్వమును ఎవడైతే అనుభవంలోనికి తెచ్చుకొన్నాడో వాడు జ్ఞాని, జ్ఞానికి నాకు ఏమీ బేధం లేదు అని చెప్పాడు.

దేవుని తెలుసుకోవాలి అనే కాంక్ష మనకు బలీయంగా ఉంటే, భగవదనుభవం పొందాలి అనే కోరిక ఆపుకోకుండా మన హృదయంలోనుండి వస్తూ ఉంటే హృదయంలో ఏ చైతన్యము అయితే ఉందో అదే నీకు రూపము ధరించి విషయీభూతం అవుతుంది. దానికి మనకు తేడా ఏమిటి అంటే దేవుడు శరీరం ధరించి వచ్చినపుడు కూడా తాను ఆ దేహము కాదు అనివాడికి తెలుస్తూ ఉంటుంది. దేవుని చేతిలో మాయ ఉంది. మాయ చేతిలో మనం ఉన్నాము. దేవుని ప్రార్థించినపుడు వీడు నిజంగా సాధన చేస్తున్నాడు వీడికి దారి ఇవ్వు అని దేవుడు మాయకు చెపుతాడు. అప్పుడు మాయ దారిఇస్తుంది. మాయ దారిఇస్తే గాని ఆయనలో మనం ఐక్యం అవ్వలేము. దేవుడు దేవుడు అంటే ఎవరో కాదు మన హృదయంలో ఉన్న చైతన్యమే మనకు దారి చూపించటంకోసం రూపం ధరించి వస్తుంది.

మరణం అంటే కంగారు పడవద్దు. మరణం అంటే మార్పు. మరణం అనేది నీకు మిత్రుడు. మరణం నీకు పాత శరీరాన్ని తీసివేసి కొత్త శరీరాన్ని ఇస్తుంది. స్మశానంలో శరీరం కాలిపోయినపుడు ఇంద్రియాలు కాలిపోతాయి, ఇంద్రియాల ద్వారా పనిచేసేవాడు కాలడు, అంటే జీవుడు కాలడు. జీవుడు ఏ శరీరమును ఉపయోగించుకొన్నాడో ఆ శరీరము కాలిపోతుంది. జీవలక్షణాలు ఏమీ పోవు. శరీరము మరణించిన తరువాత జీవలక్షణాలు ఏమీ పోవు. శరీరము మరణించేటప్పటికి 90 చెడ్డ అలవాట్లు ఉంటే మరల కొత్త శరీరములో 90 అలవాట్లు వచ్చేస్తాయి. చావుకు, పుట్టుకకు మధ్య ఒక్క అలవాటు కూడా తగ్గదు. చావుకు, పుట్టుకకు మధ్య నీ చైతన్యస్థాయి ఏమీ మారదు. అందువలన ఈ శరీరము ఉండగానే నీకు ఇచ్చిన అవకాశమును, కాలమును సద్వినియోగం చేసుకో. దేహం మరణించిన తరువాత చేసేది ఏమీలేదు. సాధన చేయాలంటే మరల దేహం రావాలి. అందువలన ఈ దేహమును ఉపయోగించుకో. ఈ శరీరాన్ని స్మశానానికి తీసుకొని వెళ్లి బూడిద చేయకముందే నీ జ్ఞానాగ్నిని పంపించి నాలోని జీవ లక్షణాలను దహనం చేయవయ్యా అని భగవాన్ అరుణాచలేశ్వరుని ప్రార్థించారు.

నేను ఉన్నాను అని అనుకో. నేను ఈ శరీరాన్ని అని అనుకోవద్దు. నేను ఉన్నాను అనుకుంటే ఈ శరీరము ఉన్నా ఒకటే, ఊడిపోయినా ఒకటే. నేను ఉన్నాను అనుకోవటంలేదు. నేను ఈ శరీరాన్ని అని మనం అనుకొంటున్నాము. అందువలన ఈ శరీరము పోయినపుడు దుఃఖము వస్తోంది.

హిందూమతములో ఇంతమంది దేవుళ్లు ఎందుకు ఉన్నారు, క్రైస్తవ మతంలో ఒకడే దేవుడు కదా అని భగవాన్‌ను అడిగితే నీ దేహానికి ఒక ఇంద్రియము సరిపోతుంది కదా ఇన్ని ఇంద్రియాలు ఎందుకు అన్నారు. ఒకో ఇంద్రియం ఒకో పని చేస్తుంది. ఒక శరీరానికి ఇన్ని ఇంద్రియాలు ఎందుకు ఉన్నాయో అందుకే హిందూమతంలో అంతమంది దేవుళ్లు ఉన్నారు అని చెప్పారు.

ఎక్కడమాటలు లేవో, ఎక్కడ ఊహలు లేవో, ఎక్కడ తలంపులు లేవో అక్కడ నేను ఉన్నాను అని చెపుతున్నారు మరి నాతో ఎందుకు మాట్లాడుతున్నారు అని రంగన్న భగవాన్‌ను అడిగారు. ప్రేమవలన, కేవలము అనుగ్రహము వలన మాట్లాడుతున్నారు. జ్ఞాని ఏది మాట్లాడినా దానికి ప్రాపంచిక ప్రయోజనములు ఏమీ ఉండవు. కేవలము అనుగ్రహంవలన మాట్లాడతాడు.